సాక్షి
విశాఖపట్నం
శనివారం । 23 । నవంబర్ । 2024


నిందితులకు బెయిల్ ఇవ్వొద్దు 8లో


పారిశ్రామిక రంగం బలోపేతం 8లో


నేటి నుంచే ధనాధన్ క్రికెట్ 8లో

మద్యం షాపుల్లో మాఫియా దందా!

- స్థలం కావాలంటే 50 శాతం వాటా
- ఒడిశా మద్యం వ్యాపారికి చుక్కలు
- చివరకు వాటా ఇచ్చిన తర్వాతే స్థలం కేటాయింపు
- తెరవెనుక చక్రం తిప్పుతున్న జనసేన ఎమ్మెల్యే
- షాపు పెట్టుకుంటే రూ.10 లక్షలు ఇవ్వాల్సిందే
- మరో కూటమి ఎమ్మెల్యే కలెక్షన్

ప్రైవేటు మద్యం షాపులకు కొత్త ప్రభుత్వం తెరలేపిన వెంటనే కూటమి ఎమ్మెల్యేలు కలెక్షన్లకు దిగారు. భారీగా అమ్మకాలుండే ప్రాంతాల్లో షాపుల ఏర్పాటు కోసం ముందుగానే అడ్వాన్సులు ఇచ్చి బ్లాక్ చేసి పెట్టుకున్నారు. లాటరీలో షాపు దక్కించుకున్న వారు అక్కడ షాపు ఏర్పాటు చేయాలంటే తమకు 50 శాతం వాటా ఇవ్వాల్సిందేనంటూ కూటమి ఎమ్మెల్యే అండదండలతో కొద్ది మంది మద్యం సిండికేట్లు పట్టుబడుతున్నారు. ఈ విధంగా ఒడిశాకు చెందిన మద్యం వ్యాపారికి దక్కిన మూడు షాపుల్లోనూ జనసేన ఎమ్మెల్యే అండదండలున్న మద్యం సిండికేట్ ముఖ్యుడు 50 శాతం వాటా తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇక వ్యాపారం జరిగే ప్రాంతాల్లో అప్పటికే ఏర్పాటైన షాపులకు సమీపంలోనే మరో షాపును సదరు మద్యం మాఫియా ఏర్పాటు చేస్తోంది. తద్వారా వారి వ్యాపారానికి గండికొడుతున్నారు. ఇక చేసేదేమీ లేక తమ షాపులో వాటాను కూడా ఈ మద్యం మాఫియాకు అప్పగించే పరిస్థితిని కల్పిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం



మరోవైపు కూటమి ఎమ్మెల్యే ఒకరు తన ప్రాంతంలో షాపు ఏర్పాటు చేసుకుంటే రూ.10 లక్షల చొప్పున మామూళ్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ విధంగా ముట్టచెప్పిన తర్వాతే షాపు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు. మొత్తంగా ప్రైవేటు మద్యం వ్యాపారంలో కూటమి ఎమ్మెల్యేలు వాటాలు, కోటాలతో జేబులు నింపుకుంటున్నారు. మరోవైపు మద్యం సిండికేట్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న ఒక వ్యక్తికి చెందిన షాపులకే ఎక్కువగా మంజీరా, కింగ్ ఫిషర్ బ్రాండ్ల మద్యం సరఫరా జరిగే విధంగా మద్యం డిపో అధికారితో వ్యవహారాలు నడుపుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పోటీ షాపులతో..

గతంలో వార్డుల వారీగా షాపుల ఏర్పాటుకు లాటరీ నిర్వహించేవారు. అయితే ఈ దఫాలో మాత్రం స్టేషన్ల వారీగా లాటరీలో షాపులను కేటాయించారు. దీనిని కూడా ఈ ప్రైవేటు మద్యం మాఫియా తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. ఒక స్టేషన్ పరిధిలో తమకు వచ్చిన షాపులను ఏర్పాటు చేయకుండా ఆ ప్రాంతంలో అప్పటికే షాపులు ఏర్పాటైన చోట్ల ఎంత మేర వ్యాపారం జరుగుతుందో ఆరా తీస్తున్నారు. బాగా వ్యాపారం జరిగే షాపులకు సమీపంలోనే వీరు వెళ్లి తమ షాపులను తెరుస్తున్నారు. ఈ విధంగా గాజువాక, పెందుర్తి, పెదవాల్తేరు సర్కిల్ ప్రాంతాల్లో బాగా వ్యాపారం జరిగే షాపులకు సమీపంలోనే ఏర్పాటు చేసి..వారి వ్యాపారాన్ని దెబ్బతీసినట్టు తెలుస్తోంది. ఇక మరో ప్రాంతంలో ఎమ్మెల్యేకు రూ. 10 లక్షలు ముట్టచెప్పిన తర్వాత ఆయన అండదండలతో ఆయన చెప్పిన స్థలంలోనే షెడ్డును నిర్మించారు. అయితే మద్యం మాఫియా కాస్తా జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసి అనధికారి నిర్మాణం పేరుతో షాపును తొలగించారు. తద్వారా మొత్తంగా రూ. 14 లక్షల మేర నష్టపోయినట్టు సదరు వ్యాపారి వాపోతున్నట్టు తెలుస్తోంది. ఇక చేసేదేమీ లేక మద్యం సిండికేట్‌కు దాసోహం అయినట్టు ప్రచారం జరుగుతోంది.



వసూళ్లలో కొత్త పంథా...!

మద్యం వ్యాపారంతో గతంలో లావాదేవీలు లేని ఓ కూటమి ఎమ్మెల్యే వసూళ్ల కోసం కొత్త పంథా అనుసరిస్తున్నాడు. తన నియోజకవర్గంలో ఎవరు షాపు ఏర్పాటు చేసినా..తనకు రూ. 10 లక్షలు ముట్టచెప్పాల్సిందేనంటూ పట్టుబడుతున్నారు. ఈ విధంగా అందరి వద్ద ఆయన వసూలు చేసినట్టు తెలుస్తోంది. అయితే వసూలు చేసిన తర్వాత షాపు ఏర్పాటుకు ఏవైనా అడ్డంకులు వచ్చినా ఆయన మాత్రం కనీసం స్పందించడం లేదని మద్యం వ్యాపారులు వాపోతున్నారు. వాస్తవానికి 20 శాతం మార్జిన్ అని మొదట్లో ప్రకటించిన ప్రభుత్వం ఆ తర్వాత మాటమార్చి 14 శాతానికి తగ్గించిందంటూ మండిపడుతున్నారు. తద్వారా కోట్లు ఖర్చు పెట్టి దక్కించుకున్న కొద్ది షాపులకు కూడా కూటమి ఎమ్మెల్యే అండదలతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా ఇబ్బందులు పెడుతోందని వాపోతున్నారు. మరోవైపు మద్యం డిపోకు వచ్చిన స్టాకును అన్ని షాపులకూ సమానంగా పంపిణీ చేయాల్సిన అధికారి కాస్తా.. కేవలం మద్యం సిండికేట్‌ను శాసిస్తున్న వారికి చెందిన కొద్ది షాపులకే మంజీరా బ్రాండ్, కింగ్ ఫిషర్ బ్రాండ్లను అధికంగా పంపిణీ చేస్తున్నారని మండిపడుతున్నారు. సదరు అధికారిపై గతంలో అనేక ఆరోపణలున్నప్పటికీ కీలకమైన మద్యం డిపో మేనేజర్‌గా కూటమి ప్రభుత్వం నియమించడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి.



'స్థాయీ' సంఘంలో విభేదాలు

- కోరం లేక సమావేశం వాయిదా
- ఇద్దరు కార్పొరేటర్లకే అభివృద్ధి పనుల కేటాయింపుపై విమర్శలు
- అందుకే డుమ్మా కొట్టిన సభ్యులు..!


కోరం లేక సమావేశం వాయిదా వేస్తున్నట్టు ప్రకటించిన మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం కోరం లేక వాయిదా పడింది. సభ్యుల్లో లుకలుకలు తారాస్థాయికి చేరుకొన్నాయి. పది మంది సభ్యుల్లో కేవలం ఇద్దరు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. సభ్యులు అడిగే ప్రశ్నలకు వివరణ ఇచ్చేందుకు అన్ని జోనల్ కార్యాలయాల నుంచి అధికారులు హాజరుకాగా..కోరం లేక సమావేశం వాయిదా వేసినట్టు నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశ మందిరంలో శుక్రవారం సమావేశం నిర్వహించేందుకు స్థాయీ సంఘ చైర్‌పర్సన్‌తో పాటు ఇద్దరు (గల్లా పోలిపల్లి, శరగడం రాజశేఖర్) సభ్యులు, అధికారులు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 11.30 గంటలైనా మిగిలిన సభ్యులు రాకపోడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్టు హరి వెంకటకుమారి తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో చెబుతామన్నారు.

మళ్లీ ఆ ఇద్దరికే..

స్థాయీ సంఘంలో సభ్యులందరూ టీడీపీ వారే అయినప్పటికీ..పార్టీలో హీరోలుగా చలామణి అవుతున్న ఇద్దరు..ముగ్గురు కార్పొరేటర్లకే కోట్లాది రూపాయల పనులు కేటాయిస్తున్నారని, మిగిలిన వారికి మొండి చేయి చూపుతున్నారంటూ ఈ నెల 8న జరిగిన స్థాయీ సమావేశంలో పలువురు సభ్యులు మండిపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రూ.కోట్ల విలువైన పనులు అన్ని వార్డుల్లో జరిగాయని, సొంత పార్టీ అధికారంలోకి వచ్చినా..ఆ ఇద్దరు..ముగ్గురుకే తప్పా..మిగిలిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందంటూ ఆ సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజాగా నిర్వహించిన సమావేశంలో కూడా ఆ ఇద్దరు కార్పొరేటర్లకు అనుకూలంగా పలు అంశాలు పొందుపరచడంతో మిగిలిన సభ్యులు డుమ్మా కొట్టినట్టు తెలుస్తోంది. టీడీపీ కార్పొరేటర్లలో ఇద్దరికి సుమారు రూ.7 కోట్ల పనులకు సంబంధించిన అంశాలు ఎజెండాలో పొందుపరచడంతో మిగిలిన సభ్యులు గుర్రుగా ఉన్నారు.

పేదల బియ్యం తరలిస్తే క్రిమినల్ కేసులు

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ హెచ్చరిక



సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, విశాఖపట్నం : పేదల కోసం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, అనధికారిక గోదాముల్లో నిల్వలుంచినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ హెచ్చరించారు. రేషన్ బియ్యం మాఫియాపై 'సాక్షి'లో 'కూటమి చేతుల్లో పరేషన్' శీర్షికపై ప్రచురించిన కథనంపై జేసీ స్పందించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. ఇకపై కఠినంగా వ్యవహరించనున్నామంటూ స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు స్టాక్ రికార్డులను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామని ఏమైనా వ్యత్యాసాలు కనిపిస్తే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అక్టోబర్ నెలలో 6ఏ కేసులు 19 నమోదు చేసి 160 క్వింటాళ్ల బియ్యంతో పాటు 8 వాహనాల్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అదే విధంగా.. నవంబర్‌లో ఇప్పటి వరకూ 6ఏ కేసులు 37 నమోదు చేయగా.. 450 క్వింటాళ్ల బియ్యం, 5 వాహనాల్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై ఈ కింది నంబర్లకు ప్రజలు ఫిర్యాదులు చెయ్యవచ్చన్నారు.

సర్కిల్-1 సహాయ సరఫరా అధికారి
9704092496
సర్కిల్-2 సహాయ సరఫరా అధికారి
8897488368
సర్కిల్-3 సహాయ సరఫరా అధికారి
8008308282
భీమిలి డిప్యూటీ తహశీల్దార్
9866060835
పెందుర్తి డిప్యూటీ తహశీల్దార్
8247845510

రేపు ఉచిత శిక్షణ

విశాఖ సిటీ: నృత్యం, చిత్రలేఖనం, సంగీత విభాగాల్లో బాల, బాలికలకు అనుభవజ్ఞులైన శిక్షకులతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని బాల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉలిక్కిపడ్డ గాజువాక

- డయేరియాతో 19 మందికి అస్వస్థత
- ఆస్పత్రిలో చేరిన బాధితులు
- తాగునీటి కలుషితంతో సంఘటన
- సాయిరామ్‌నగర్‌లో 24/7 వైద్య శిబిరం
- నీటి సరఫరా ఈఈకి షోకాజ్ నోటీసు
- ఎమినిటీ కార్యదర్శి సస్పెన్షన్‌కు ఆదేశం


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో జగదీశ్వరరావు


చికిత్స పొందుతున్న త్రివేణి, పద్మావతి

గాజువాక : గాజువాకలో డయేరియా ప్రబలింది. జీవీఎంసీ సరఫరా చేస్తున్న తాగునీరు పైప్‌లైన్ లీకై మురుగునీరులో కలవడంవల్ల ఈ సంఘటన చోటుచేసుకున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. 67వ వార్డు సాయిరామ్‌నగర్‌లో జరిగిన ఈ సంఘటనతో గాజువాక ఒక్కసారిగా ఉలిక్కిపడింది. డయేరియా కారణంగా 19 మంది అస్వస్థతకు గురైనట్టు కొత్త గాజువాక అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి ఫెల్వియా మోనికా తెలిపారు. వారిలో పల్లా పద్మావతి (54) స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రిలోను, బగ్గం త్రివేణి (35) స్థానిక ఆర్కే ఆస్పత్రిలోను చికిత్స పొందుతున్నారు. మిగిలినవారు ఇళ్లవద్దే చికిత్స తీసుకొంటున్నారు. తాగునీరు కలుషితంతో ఈ వ్యాధి ప్రబలినట్టు జీవీఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్ధారించారు. సాయిరామ్‌నగర్‌లోని మురుగునీటి కాలువకు ఆనుకొని నీటి పైప్‌లైన్ ఉంది. కొద్దిరోజుల క్రితం పైప్‌లైన్ లీకై నీరు మురుగునీటి కాలువలో కలుస్తోంది. **అదే సమయంలో** మురుగునీరు కూడా పైప్‌లైన్‌లోకి వెళ్లిపోతోంది. నివాసులు అదే నీటిని తాగుతుండటంతో వాంతులు, విరేచనాలకు గురైనట్టు అధికారులు తెలిపారు. డయేరియా విషయం తెలుసుకున్న జీవీఎంసీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పారిశుధ్య విభాగం సిబ్బంది ఆ ప్రాంతంలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కాగా, కొత్త గాజువాక అర్బన్ పీహెచ్‌సీ సిబ్బంది 24/7 వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సంఘటన వెలుగు చూసిన వెంటనే జీవీఎంసీ సిబ్బంది నీటి ట్యాంకులద్వారా తాగునీటిని సరఫరా చేశారు. సాయిరామ్‌నగర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా, నీటి సరఫరా విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.వెంకటరావుకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని, వార్డు ఎమినిటీ కార్యదర్శి బొడ్డేటి నవీన లక్ష్మిని విధులనుంచి సస్పెండ్ చేయాలని ఆయన జోనల్ కమిషనర్ శేషాద్రిని ఆదేశించారు.

అధికారుల నిర్లక్ష్యం



తాగునీటి సరఫరా విషయంలో అధికారులు తొలినుంచీ నిర్లక్ష్యంగా ఉన్నారు. నీరు శుభ్రంగా ఉండటంలేదని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈరోజు ఈ సంఘటన చూడాల్సి వచ్చింది.

– జామి జగన్నాథరావు, సాయిరామ్‌నగర్

రంగుమారిన నీళ్లు



పైప్‌లైన్లు ఎక్కడికక్కడ లీకై పోతున్నాయి. దీనివల్ల చాలాసార్లు రంగుమారిన నీళ్లు వస్తుంటాయి. ఈ విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. దీనివల్ల ఆరోగ్యాలు కూడా పాడవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలి.

– సాహు సుమిత్ర, సాయిరామ్‌నగర్

విజ్ఞాన వీచిక



విహార యువగీతిక

- తమ గురించి తాము తెలుసుకునే రైలు ప్రయాణం
- విశాఖ చేరుకున్న జాగృతియాత్ర
- 15 రోజులపాటు 8 వేల కిమీ సాగనున్న స్పెషల్ ట్రైన్



సాక్షి, విశాఖపట్నం/పెందుర్తి/తగరపువలస : సాధారణంగా చూసేందుకు అది రైలే. కానీ మరింత పరికించి చూస్తే అదో కదిలే విశ్వవిద్యాలయం. ప్రతి బోగీ ఒక తరగతి గది. ఆలోచనలకు పదునుపెట్టాలన్నా.. వాటి నుంచి అద్భుతాలను ఆవిష్కరించాలనే కాంక్ష యువతరంలో బలంగా నాటుకోవాలన్నా.. విజ్ఞానాన్ని, సృజనాత్మకతను పెంపొందించాలన్నా..ఆ రైలులో కూర్చుంటే చాలు. జీవితానికి సరిపడా జ్ఞానాన్ని ఆ ప్రయాణంలోనే సముపార్జించుకోవచ్చు. ఆ ప్రయాణం పేరే జాగృతి యాత్ర. కేవలం నడిచేది 15 రోజులే అయినా జీవితాంతం తప్పటడుగులు వెయ్యకుండా నడిచేంత ధైర్యాన్ని నూరిపోస్తుందీ యాత్ర. తమను తాము తెలుసుకునేందుకు ముంబైలో బయలుదేరిన జాగృతి యాత్ర రైలు శుక్రవారం విశాఖ చేరుకుంది.

మళ్లీ వస్తా..



బీటెక్ ఎలక్ట్రానిక్స్ పూర్తి చేశాను. జాగృతియాత్ర బిజినెస్ టూర్‌లా సాగుతోంది. ఎక్కడైనా అందరికీ సమాన అవకాశాలు ఉంటాయి. వాటిని ఎలా వినియోగించుకోవాలో ఇక్కడ తెలియజేస్తున్నారు. సామాజికసేవలో భాగంగా గ్రామాలను అభివృద్ధి చేయడానికి ఉపయోగపడుతుంది.

– దీప్తి, హైదరాబాద్

టూరిజం వైపు అడుగులు



ప్రస్తుతం టూరిజం ట్రావెల్ రంగంలో ఉన్నా. జాగృతి యాత్ర ద్వారా టూరిజం రంగంలో ఉన్న లోటుపాట్లు, ఇతరత్రా అంశాలను పరిశీలిస్తున్నా..అరకు టూరిజం బాగుంది. దీనిపై ప్యాకేజీలు అందిస్తున్నాం. తాజాగా ఎక్స్‌పీరియన్స్‌ల్ ట్రావెల్ పేరిట ప్యాకేజీలు అందించాలన్నది మా ఆలోచన. ఈ ప్యాకేజీ ద్వారా గిరిజన ప్రజలతో మమేకం అయ్యి వారి జీవన విధానాలు తెలుసుకునే విధంగా ప్రణాళిక రూపకల్పన చేస్తున్నాం.

– బొడ్డేపల్లి అవినాష్, సుజాతనగర్, పెందుర్తి

జీవితంలో స్థిరపడేంత అనుభవం

ఈ రైలు ఎక్కిన వారంతా 30 ఏళ్లలోపు వాళ్లే. తమ ప్రయాణంలో జీవితంలో స్థిరపడేంత అనుభవాన్ని సంపాదించుకుంటారు. ముఖ్యంగా ఎడ్యుప్రెన్యూర్ షిప్, అగ్రి, సోషల్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్స్‌పై అవగాహన ప్రతి ఒక్కరికీ కలుగుతుంది. ఈ ఏడాది భారత్‌తో పాటు 23 వివిధ దేశాలకు చెందిన 525 మంది యాత్రికులను వడపోత ద్వారా ఎంపిక చేశారు. ఈనెల 16న ముంబైలో మొదలైన రైలు 12 నగరాల్లో తిరిగి డిసెంబర్ 1న ముంబైలో ముగియనుంది. శుక్రవారం పెందుర్తి రైల్వే స్టేషన్‌కు జాగృతి రైలు చేరుకుంది. యువతీయువకులు పెందుర్తి నుంచి నేరుగా గంభీరంలోని అక్షయపాత్రను సందర్శించారు. అక్కడి నుంచి గీతం యూనివర్సిటీకి వెళ్లి విద్యార్థులు, ప్రొఫెసర్లతో సంభాషించారు.

గోల్ సాధిస్తా..



బీటెక్ పూర్తి చేసి ఎలమంచిలి, అచ్యుతాపురం, ఒంగోలు, తిరుపతిలలో స్టార్టప్ వ్యాపారం చేస్తున్నాను. ఈ యాత్ర ద్వారా నిధులు సమీకరించి హైదరాబాద్, విజయవాడలకు ఈ వ్యాపారాన్ని విస్తరిస్తా. కచ్చితంగా గోల్ సాధనకు ఈ యాత్ర ఉపయోగపడుతుంది.

– కట్టా ప్రణీత్, ఎలమంచిలి

ప్రతి కోచ్‌లోనూ నిపుణులతో చర్చలు

ఈ యాత్ర జాగృతి సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో 17 ఏళ్లగా కొనసాగుతోంది. వ్యవస్థాపకుడిగా శశాంక్ మణి వ్యవహరిస్తున్నారు. ఎంటర్‌ప్రైజెస్ ద్వారా భారతదేశాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో యాత్రను నిర్వహిస్తున్నారు. మొత్తం 150 మంది నిపుణులు.. ట్రైన్‌లో ప్రయాణించే వారి జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేలా జీవిత పాఠాలు బోధిస్తారు. తరగతిగదిలో నేర్చుకున్న దానికీ, బయట పరిశ్రమల అవసరాలకు మధ్య పెరుగుతున్న అంతరం తగ్గించేలా.. ఎప్పటికప్పుడు కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా.. రైలు దిగేలోపు జీవితంలో ఏదో ఒకటి సాధిస్తామన్న విశ్వాసాన్ని కల్పిస్తారు. అంతేకాకుండా ముంబై, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై మొదలైన మెట్రో నగరాల్లో దిగ్గజాలతో ఇంటరాక్షన్ సెషన్స్ కూడా నిర్వహిస్తారు. ఇప్పటికే ఈ 17 ఏళ్ల రైలు ప్రయాణంలో 28 శాతం మంది పారిశ్రామికవేత్తలుగానూ, 62 శాతం మంది ఉద్యోగాల్లోనూ మిగిలిన వారు సామాజిక సేవలో స్థిరపడ్డారు.

ఉపాధి అవకాశాలు



పారిశ్రామికవేత్తలను తయారు చేసి గ్రామీణులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే జాగృతి యాత్ర లక్ష్యం. ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ సొంతంగా స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసి లాభదాయక ఉత్పత్తులు ఎగుమతి చేసేలా సిద్ధం చేస్తాం. అందులో భాగంగా గంభీరంలోని అక్షయపాత్ర వంటశాలను సందర్శించాం.

– శేషగిరి, ట్రస్ట్ సభ్యుడు, జాగృతి సేవాసంస్థ, ఉత్తరప్రదేశ్

అక్షయపాత్ర సందర్శన

తగరపువలస: అక్షయపాత్ర ఫౌండేషన్ అపరిమిత ఆహారంతో అపారమైన విద్యను అందిస్తుందని అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస తెలిపారు. శుక్రవారం సాయంత్రం జాగృతి సేవాసంస్థ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందిన పారిశ్రామిక రంగంలో ఆసక్తి కలిగిన 525 మంది యువతీయువకులు ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని అక్షయపాత్ర వంటశాలను అధ్యయనం చేయడానికి వచ్చారు. వీరిని ఉద్దేశించి సత్యగౌర చంద్రదాస ప్రసంగించారు. తమ ఫౌండేషన్ ద్వారా దేశవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థులకు 75 వంట శాలల ద్వారా ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో 24 ఏళ్లుగా నిత్యం మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నామన్నారు. ఫౌండేషన్ విశాఖ అధ్యక్షుడు నిష్క్రించిన భక్తదాస ఆధ్వర్యంలో జాగృతి యాత్ర వరుసగా 9వసారి అక్షయపాత్ర ఫౌండేషన్‌ను సందర్శించినట్టు గుర్తు చేశారు.


అక్షయపాత్రలో యువతీ యువకులు

నేటి నుంచి వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్



మాట్లాడుతున్న ఫెస్ట్ నిర్వాహకులు

బీచ్‌రోడ్డు : లిట్ లాంటర్న్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని హవా మహల్ వేదికగా శని, ఆదివారాల్లో వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్–2024 జరగనుంది. సిరిపురంలోని ఒక హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు ప్రియా ఉప్పలపాటి, సంధ్యా గోడే, సానాల్ సరా ఈ వివరాలు వెల్లడించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఫెస్ట్‌లో ప్రపంచంలోని 19 మంది ప్రముఖ స్టోరీ టెల్లర్స్ పాల్గొంటున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ సుమారు 44 సెషన్లు ఉంటాయని, 4 నుంచి 16 ఏళ్ల వయసు గల విద్యార్థుల కోసం ఎక్కువ సెషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ఆనందించే సెషన్లు కూడా ఉన్నట్లు చెప్పారు. తొలిసారిగా ఈ ఫెస్ట్‌ను ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, హిందీ భాషాల్లో కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఫెస్ట్‌కు ఇప్పటికే 2 వేల మంది విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని, వేదిక వద్ద కూడా పేర్లు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికాకు చెందిన ప్రముఖ కథా రచయిత్రి బొంగిస్వా వారి సాంస్కృతికి చెందిన గీతాన్ని ఆలపించారు. పేజెస్ బుక్ ఎండీ సునీల్ నెవాటియ మాట్లాడుతూ ఇది గొప్ప కార్యక్రమమని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అయ్యప్ప భక్తుల కోసం శ్రీకాకుళం-కొల్లాం మధ్య రైలు

తాటిచెట్లపాలెం: అయ్యప్ప భక్తుల కోసం శ్రీకాకుళం రోడ్-కొల్లాం- శ్రీకాకుళం రోడ్ మధ్య వాల్తేర్ డివిజన్ స్పెషల్ రైళ్ల నడుపుతోంది. ప్రస్తుతం నడుస్తున్న విశాఖ-కొల్లాం రైలును ఫిబ్రవరి వరకు పొడిగించింది.

- శ్రీకాకుళం రోడ్-కొల్లాం(08553) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరి 8.47 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.52 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జనవరి 26 వరకు నడుస్తుంది. కొల్లాం-శ్రీకాకుళం రోడ్(08554) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమవారం సాయంత్రం 4.30 గంటలకు కొల్లాంలో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 10.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి రాత్రి 10.40 గంటలకు బయల్దేరి శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది.
- విశాఖ-కొల్లాం(08539) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయల్దేరి గురువారం మధ్యాహ్నం 12.55గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు ఫిబ్రవరి 26వ తేదీ వరకు పొడిగించారు. తిరుగు ప్రయాణంలో ప్రతీ గురువారం కొల్లాంలో రాత్రి 7.35 గంటలకు బయల్దేరి శుక్రవారం రాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది.

నేటి నుంచే ధనాధన్ క్రికెట్

- వైఎస్సార్ స్టేడియంలో ఎస్‌ఎంఏ టోర్నీ గ్రూప్ డీ మ్యాచ్‌లు ప్రారంభం
- చండీగఢ్, పుదుచ్చేరి మధ్య తొలి మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: దేశవాళీ ధనాధన్ టీ–20 క్రికెట్ శనివారం నుంచి ప్రారంభంకానుంది. సయ్యద్ ముస్తాక్ అలీ(ఎస్‌ఎంఏ) టోర్నీలో భాగంగా గ్రూప్ డీ మ్యాచ్‌లకు వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఇప్పటికే గ్రూప్‌లో తలపడుతున్న ఏడు జట్లలో ఆరు జట్లు స్టేడియం బీ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేసుకున్నాయి. శుక్రవారం ఉదయం సెషన్‌లో అసోం, రైల్వేస్ జట్లు, మధ్యాహ్నం సెషన్‌లో చండీగఢ్, పుదుచ్చేరి జట్లు నెట్స్‌లో శ్రమించాయి. సాయంత్రం సెషన్‌లో విదర్భ, ఒడిశా జట్లు ప్రాక్టీస్ చేశాయి. ఛత్తీస్‌గఢ్ జట్టు శనివారం వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేయనుంది. టోర్నీలో భాగంగా శనివారం నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు రోజు విడిచి రోజు విశాఖలో రెండు మ్యాచ్‌లు, విజయనగరంలో ఒక మ్యాచ్ జరగనుంది. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో తొలి మ్యాచ్ శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. మరో మ్యాచ్ సాయంత్రం నాలుగున్నర గంటలకు డే నైట్‌గా జరగనుంది. ప్రస్తుత సీజన్‌లో విశాఖ వేదికగా ఆడుతున్న జట్లలో గతేడాది ఆయా గ్రూప్‌ల్లో విదర్భ టాపర్‌గా నిలవగా అసోం ద్వితీయ స్థానంలో నిలిచింది. గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో అసోం ఆటగాడు రియాన్ పరాగ్ అత్యధిక స్కోర్‌తో టాపర్‌గా నిలిచాడు. ఈ సారి అసోం జట్టుకు దినేష్ దాస్, విదర్భకు కీపర్ బ్యాటర్ జితేష్ శర్మ, రైల్వేస్‌కు ఉపేంద్ర, పుదుచ్చేరికి దామోదర్, ఒడిశాకు గోవింద, చండీగఢ్‌కు మనన్ వోహ్రా, ఛత్తీస్‌గఢ్ జట్టుకు అమన్‌దీప్ నాయకత్వం వహిస్తున్నారు.



ప్రాక్టీస్ చేస్తున్న పుదుచ్చేరి జట్టు

హైదరాబాద్ వేదికగా తలపడనున్న ఆంధ్రా జట్టు

ఈ ట్రోఫీలో ఆంధ్రా జట్టు గ్రూప్ ఈలో హైదరాబాద్ వేదికగా ఆడనుంది. జట్టుకు రికీబుయ్ నాయకత్వం వహిస్తుండగా వైస్ కెప్టెన్‌గా రషీద్, వికెట్ల వెనుక భరత్ సహకరించనున్నాడు. అశ్విన్ హెబ్బర్, ప్రసాద్, వంశీకృష్ణ బ్యాటింగ్‌తోనూ శశికాంత్, అవినాష్, సత్యనారాయణ, స్టీఫెన్ చెలరేగే బంతులతో రాణించేందుకు సిద్ధమయ్యారు.

నేటి మ్యాచ్‌లు

వైఎస్సార్ స్టేడియంలో ఉదయం 11 గంటలకు చండీగఢ్‌తో పుదుచ్చేరి, సాయంత్రం నాలుగున్నర గంటలకు విదర్భతో ఒడిశా తలపడనుంది. విజయనగరం పీవీజీ రాజు ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో ఉదయం 11 గంటలకు అసోంతో రైల్వేస్ జట్టు పోటీపడనుంది.

యశ్వంత్, విజయ్, కుమార్ స్పిన్ మాయాజాలంతో ఆకట్టుకోనున్నారు.

మ్యాచ్‌లను ఉచితంగానే వీక్షించండి

దేశవాళీ టీ–20 మ్యాచ్‌లను ఉచితంగానే స్టేడియంలో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. ఐపీఎల్, జాతీయ జట్లకు ఆడిన ఆటగాళ్లు ఎస్‌ఎంఏ టోర్నీలో పాల్గొంటున్నారు. విశాఖలో ఈ మ్యాచ్‌లను వీక్షించాలనుకునే అభిమానులను గేట్ నంబర్ 15 నుంచి ప్రవేశం కల్పిస్తున్నాం. మ్యాచ్‌లు సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం.

– సతీష్, కార్యదర్శి, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్

అప్పన్నను దర్శించుకున్న యువ క్రికెటర్లు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం పలువురు దేశవాళీ క్రికెటర్లు దర్శించుకున్నారు. శుభమ్ దూబే, జితేష్ శర్మ, దీపేష్ పర్వాని, పార్థ్ రేఖడే, యష్ థోరట్, అక్షయ్ వాడ్కర్, మందర్ మహలే స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అంతరాలయంలో అర్చకులు అష్టోత్తరపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రాలను ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు. ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్, ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అప్పన్న ఆలయంలో యువ క్రికెటర్లు

కళా సేవకుడికి కన్నీటి వీడ్కోలు



నివాళులర్పిస్తున్న స్టార్ మేకర్ సత్యానంద్



రోదిస్తున్న బాదంగీర్‌సాయి భార్య, కుటుంబ సభ్యులు

ముగిసిన బాదంగీర్‌సాయి అంత్యక్రియలు

సీతమ్మధార: తుది శ్వాస వరకు కళ కోసం తపించిన బాదంగీర్ సాయికి కళాకారులు కన్నీటి వీడ్కోలు పలికారు. కొంతకాలంగా బ్రెయిన్ హెమరేజ్ సమస్యతో బాధపడుతున్న ఆయన ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూసిన విషయం తెలిసిందే.. మురళీనగర్‌లోని ఆయన నివాసానికి సాయి భౌతికకాయం తీసుకురాగా.. శుక్రవారం కళాకారులు, కళాభిమానులు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కళా ఆస్పత్రి ఎండీ డాక్టర్ పి.వి.రమణమూర్తి మాట్లాడుతూ బాదంగీర్ సాయి మృతి విశాఖ కళారంగానికి తీరనిలోటన్నారు. ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ విశాఖలో నాటక రంగానికి పూర్వవైభవం తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి బాదంగీర్ సాయి అని, కళ కోసం డబ్బును, జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ఏపీ మా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ మాట్లాడుతూ బాదంగీర్ సాయి నాటక రంగానికి ఊపిరి పోశారని, తుది శ్వాస వరకు నాటక రంగం కోసం కష్టపడ్డారన్నారు. అనంతరం బాదంగీర్ సాయి అంతిమ యాత్ర నిర్వహించి.. మద్రిపాలెం సమీపంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కళాకారులు, కళాభిమానులు, రచయితలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తుది వీడ్కోలు పలికారు. అంతిమ యాత్రలో స్టార్‌మేకర్ సత్యానంద్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, సినిమా దర్శకుడు యాద్‌కుమార్, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ చెన్నా తిరుమలరావు, ఎస్ఎస్ఆర్, చంద్రశేఖర్, శివజ్యోతి, జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు నల్లబ్యాడ్జీలు ధరించారు.

సోలార్ ఎనర్జీలో విశాఖను మోడల్‌గా తీర్చిదిద్దాలి

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంపీ గొల్ల బాబూరావు విజ్ఞప్తి
- సౌర విద్యుత్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పిలుపు

విశాఖ విద్య: పర్యావరణహితమైన సౌర విద్యుత్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలని రాజ్యసభ సభ్యుడు, రెన్యూవబుల్ ఎనర్జీ పార్లమెంట్ కమిటీ సభ్యుడు గొల్ల బాబురావు కోరారు. ఆంధ్రప్రదేశ్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో ఏర్పాటు చేసిన 'రీ-నెక్స్'సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పోను శుక్రవారం ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ బాబూరావు మాట్లాడుతూ సోలార్ ఎనర్జీపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సోలార్ ఎనర్జీలో విశాఖను మోడల్ జిల్లాగా తీర్చిదిద్దాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు కోసం ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఇంటిపై సోలార్ వ్యవస్థ పెట్టుకునే వారి సంఖ్య నెలనెలా పెరుగుతోందని, ఈపీడీసీఎల్ పరిధిలో 4 లక్షల సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు హేమ కుమార్, జనరల్ సెక్రటరీ, రామ్మోహన్‌రావు, తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ బాబు, నాగరాజు, జయబాబు, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎంపీ గొల్ల బాబూరావు

వెలవెలబోయిన ఎక్స్‌పో

- కంపెనీలు రాక ఖాళీగా స్టాళ్లు



ఎక్స్‌పోలో ఖాళీగా దర్శనమిస్తున్న స్టాల్స్

విశాఖ విద్య: రీ నెక్స్-రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్ పో తొలిరోజు తుస్సుమంది. ఏపీ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహణ కోసమని సినిమా సెట్టింగుల మాదిరి ఏర్పాట్లు చేసినా.. వివిధ కంపెనీలు ప్రదర్శించిన సోలార్ పరికరాలు చూసేందుకు జనం కరువయ్యారు. సౌర విద్యుత్ పరికరాల తయారీ, విక్రయ కంపెనీలు 40 వరకు ఎక్స్‌పోలో పాల్గొని, స్టాళ్ల ఏర్పాటు చేశారని నిర్వాహకులు చెబుతున్నారు. కానీ ఎక్స్‌పోలో చాలా స్టాల్స్‌లో ఎటువంటి ప్రదర్శనలు లేక ఖాళీగా దర్శనమిచ్చాయి.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల విజేత విశాఖ

విశాఖ విద్య: కృష్ణా జిల్లా మచిలీపట్నం కేంద్రంగా జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్–14, అండర్–17 కేటగిరీల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన బాల, బాలికల జట్లు ప్రతిభ చూపాయి. అండర్–17 బాలికల పోటీల్లో 13, బాలురు 9 బంగారు పతకాలు, అండర్–14లో బాలికలు 10 బంగారు పతకాలు సాధించారు. దీంతో జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేముడును డీఈవో ప్రేమ్‌కుమార్ అభినందించారు.



ట్రోఫీ అందుకుంటున్న విశాఖ బాక్సర్లు

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక రేపు

ఎంవీపీకాలనీ: ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరగనున్న 71వ రాష్ట్ర స్థాయి సీనియర్ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 24న జరగనుంది. ఈ విషయాన్ని విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాదరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏయూ ఇండోర్ స్టేడియం వేదికగా ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు మహిళలు, పురుషుల జట్లు ఎంపిక ఉంటుందన్నారు. 85 కేజీల లోపు బరువున్న పురుషులు, 75 కిలోలలోపు బరువు ఉన్న మహిళా క్రీడాకారులు ఈ ఎంపికకు అర్హులన్నారు. ఎంపికైన జట్లు డిసెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు విశాఖ జిల్లా నుంచి ఈ చాంపియన్‌షిప్‌కు ప్రాతినిథ్యం వహిస్తాయన్నారు. పూర్తి వివరాలకు 96666 55355, 80084 85344లో సంప్రదించవచ్చు.

ఏయూలో అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

- 33 కళాశాలల నుంచి 620 మంది క్రీడాకారులు రాక

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానం వేదికగా వీసీ ఆచార్య శశిభూషణరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఈ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా 100 మీటర్లు, 5000 మీటర్ల పురుషులు, మహిళల విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు వీసీ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. క్రీడల్లో ఉన్నతంగా రాణించి, ఏయూకు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావాలని క్రీడాకారులను ప్రోత్సహించారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ మాట్లాడుతూ 44 ఈవెంట్లలో పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 33 కళాశాలలకు చెందిన 620 మంది క్రీడాకారులు ఈ క్రీడల్లో హోరాహోరీగా తలపడ్డారు. 100 మీటర్లు, లాంగ్ జంప్, జావెలిన్ త్రో క్రీడలు ఉత్కంఠ భరితంగా సాగాయి. వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు, రీసెర్చ్ స్కాలర్స్, ఎంపీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో వీసీ శశిభూషణరావు, స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య విజయమోహన్

నలుగురు ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు

విశాఖ సిటీ: విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లకు నగరంలో పలు పోలీస్‌స్టేషన్లలో పోస్టింగ్‌లు లభించాయి. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.కాంతారావును టూ టౌన్ లా అండ్ ఆర్డర్‌కు, ఎం.సి.హెచ్.ఎస్.నారాయణను కంచరపాలెం క్రైమ్‌కు, ఎ.లక్ష్మునాయుడును ఫోర్త్‌టౌన్ లా అండ్ ఆర్డర్‌కు, ఎం.అప్పలరాజును ఎంవీపీ క్రైమ్‌కు నియమించారు.

లైంగిక దాడికి పాల్పడిన నిందితులకు బెయిల్ ఇవ్వొద్దు

విశాఖ లీగల్ : ఇటీవల న్యాయ విద్యార్థిపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన నిందితులకు బెయిలు ఇవ్వొద్దని విశాఖ న్యాయవాదుల సంఘం నినదించింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులందరూ కోర్టు బయట నిరసన కార్యక్రమం చేపట్టారు. సహ న్యాయ విద్యార్థిపై ఆమె మిత్రుడుతో పాటు వంశీ, బొడ్డు జగదీష్, పోలిపల్లి ఆనంద్, దేవులపల్లి రాజేష్ సంయుక్తంగా హింసించి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఇందులో ఆనంద్ మినహా మిగతా ముగ్గురు న్యాయ విద్యార్థులే. వీరందర్నీ రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. నిందితులకు ఏ ఒక్క న్యాయవాది కూడా బెయిల్ ఇవ్వకూడదని ప్రకటిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులను ఉద్దేశించి విశాఖ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ మాట్లాడారు. న్యాయ విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడి జరగడం దురదృష్టకరమన్నారు. ఇందులో ఏ ఒక్కరికి బెయిల్ రాకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జె.పృథ్వీరాజ్, పలకా శ్రీరామ్మూర్తి, రామాంజనేయులు, డి.పద్మారాణి, బి.లక్ష్మి రాంబాబు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగం బలోపేతం

మహారాణిపేట: పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని పారిశ్రామిక వేత్తలు, ఉత్పత్తి దారులు ప్రభుత్వం అందించే ప్రయోజనాలను పొంది మరింత అభివృద్ధి చెందాలని సూచించారు. శుక్రవారం జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్ల, అసోసియేషన్ ప్రతినిధులతో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా కృషి చేయనున్నామన్నారు. పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలుగా సహకరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలను స్థాపిస్తే ఉపయుక్తంగా ఉంటుందో జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్ల, అసోసియేషన్ ప్రతినిధులు తమ సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి. ఆదిశేషు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.మురళీ మోహన్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కోర్టు ప్రత్యేక పీపీగా ఆదినారాయణ

విశాఖ-లీగల్ : పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మైలపల్లి ఆదినారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్త పబ్లిక్ ప్రాసిక్యూటర్ వచ్చే వరకు ఆదినారాయణ ఈ పదవిలో కొనసాగుతారు.

సిటీ ఏఆర్ ఏసీపీగా వెంకటఅప్పారావు

విశాఖ సిటీ: నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీగా ఎస్.వెంకటఅప్పారావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న ఎ.రాఘవేంద్రరావును విశాఖ హోంగార్డ్స్ డీఎస్పీగా బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల ఉత్తర్వులు జారీ చేశారు. హోంగార్డ్స్ డీఎస్పీగా ఉన్న డి.ఏడుకొండలరెడ్డిని గుంటూరు ఏఆర్ డీఎస్పీగా పంపించారు. అలాగే సత్యసాయి జిల్లాలో ఏఆర్ డీఎస్పీగా ఉన్న విజయ్‌కుమార్‌ను విశాఖ నగర ఏఆర్ ఏసీపీగా నియమించారు. ఆ స్థానంలో ఉన్న బి.సీతారామును అల్లూరి సీతారామరాజు జిల్లా ఏఆర్ డీఎస్పీగా బదిలీ చేశారు.

స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ నూతన కార్యవర్గం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీకి శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో యూనియన్ అధ్యక్షుడిగా కె.దాలినాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డి.పుల్లారావు, ఉపాధ్యక్షుడిగా వై.వి.రమణ, ప్రధాన కార్యదర్శిగా డి.వి.రమణను నియమించినట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమరనాథ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆహారం కల్తీ.. వ్యాపారులకు రూ.2.80 లక్షల జరిమానా

మహారాణిపేట: ఆహార కల్తీ కేసులకు సంబంధించి వ్యాపారులకు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ భారీగా జరిమానా విధించారు. ఇటీవల కాలంలో జిల్లాలో ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు జరిపిన తనిఖీల్లో పలు షాపులు, హోటళ్లలో నమూనాలు సేకరించి.. లేబొరేటరీకి పంపిన సంగతి తెలిసిందే. ఈ నమూనాలను సంబంధించి నాణ్యాత ప్రమాణాలు లేనట్లు నివేదికలు రావడంతో సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకున్నట్టు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జీవీబీ నందాజీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులను జేసీ కోర్టులో విచారించి.. మొత్తం ఏడు కేసుల్లో వ్యాపారులకు రూ.2.80 లక్షల జరిమానా విధిస్తూ జేసీ మయూర్ అశోక్ తీర్పు చెప్పారు. శ్రీ విజయ విశాఖ పార్లర్(టోన్డ్ మిల్క్)కు రూ. 2 లక్షలు, దాబా సిటీ పంజాబ్(పెరుగు), గున్నరాజు ఎంటర్‌ప్రైజెస్(బెల్లం)కు రూ.20 వేలు చొప్పున, టీస్టీ మసాలా(పెసర పప్పు)కు రూ.15 వేలు, సుప్రజ ఫుడ్(ప్యాకెట్ డ్రింకింగ్ వాటర్)కు రూ.10 వేలు, గోపాలకృష్ణ ప్రొడక్ట్స్(టమాటా సాస్)కు రూ.10 వేలు, బెంగుళూర్ అయ్యంగర్ బేకరీ(బ్రెడ్)కు రూ.5 వేలు జరిమానా విధించినట్లు నందాజీ తెలిపారు. ఈ వస్తువులు కల్తీ లేదా నాణ్యాత ప్రమాణాలు లోపించడం, నకిలీ బ్రాండెడ్ ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేశారు. వ్యాపారులపై ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ చట్టం 2006 కింద కేసులు నమోదు చేశారు.

పరిపాలనాదక్షుడు గురునాథరావు

అక్కిరెడ్డిపాలెం: మాజీమంత్రి గుడివాడ గురునాథరావు పరిపాలనాదక్షుడని ఆయన తనయుడు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురునాథరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం మింది హైస్కూల్ వద్ద గల ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డిలతో కలిసి అమర్‌నాథ్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురునాథరావు మరణించి 23 ఏళ్లు గడిచినా.. ప్రజలందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్నారన్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మూడు ఫ్రీజర్ బాక్స్‌లను అక్కిరెడ్డిపాలెం, మింది, గుడివాడ అప్పన్నకాలనీలకు చెందిన శ్మశాన వాటికలకు అందజేశారు. వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, కార్పొరేటర్లు ఇమ్రాన్, గుడివాడ అనూష, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ పల్లా చినతల్లి, నాయకులు గుడివాడ లతీష్, కోమటి శ్రీనివాసరావు, మంత్రి శంకర్‌నారాయణ, సిరట్ల శ్రీనివాస్, బోగాది సన్యాసిరావు, వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



గురునాథరావు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి. చిత్రంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

మైనర్‌పై లైంగికదాడి.. యువకుడి అరెస్ట్




దినేష్‌కుమార్

అల్లిపురం: బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి .. అత్యాచారానికి పాల్పడిన యువకుడిని టూటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలివీ. కొబ్బరితోట, ఎస్‌వీపీ నగర్‌కు చెందిన బాలిక తప్పిపోయిందని ఆమె తల్లి ఈ నెల 14న టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో 17న మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు 20న బాలికను కనుగొన్నారు. ఆమె నుంచి వివరాలు తెలుసుకున్నారు. కొబ్బరితోటకు చెందిన రౌడీ షీటర్ దేశరాజు దినేష్‌కుమార్ తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుందామని చెప్పి విజయనగరం తీసుకువెళ్లినట్లు చెప్పింది. అక్కడ ఒక ఇంట్లో ఉంచి పలుమార్లు శారీరకంగా లొంగదీసుకున్నాడని పేర్కొంది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు దినేష్‌కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసి .. శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

కిశోర బాలికల చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మహారాణిపేట: కిశోర బాలికల ఆరోగ్యం, చదువుపై అధికారులు శ్రద్ధ వహించాలని, వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కిశోరి వికాసంపై జిల్లా స్థాయి శిక్షణ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందరూ ఉన్నత స్థానాలకు చేరుకునేలా తర్ఫీదు ఇవ్వాలని, వారిలో ఆత్మవిశ్వాసం నింపాలని సూచించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని, వైద్య పరమైన సేవలందించాలన్నారు. జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, జిల్లా బాలల సంరక్షణ అధికారి లక్ష్మి, మహిళా పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లీశ్వరి, ఆనందపురం ఎంపీడీవో జానకి, జీసీడీవో కలీషా బేగం, జిల్లా ఒకేషనల్ అధికారి రాధ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమత, జిల్లా ఇమ్యూనేజేషన్ అధికారి డాక్టర్ జీవన్ రాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

సింధియా: సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ షిప్ బిల్డింగ్(సెమ్స్), వైజాగ్ జనరల్ కార్గో బెర్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా సీఎన్‌సీ మెషీన్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నాయి. 18 నుంచి 27 ఏళ్ల వయసు ఉండి.. ఇంటర్, ఐటీఐ, డిప్లమో కోర్సుల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ ఉత్తీర్ణులైన యువతీయువకులు శిక్షణకు అర్హులు. విశాఖపట్నం పోర్టు పరిసర ప్రాంత నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు సింధియా జంక్షన్‌లోని సెమ్స్ కేంద్రంలో గానీ, 86884 11100, 0891-2704010 నంబర్లలో గానీ సంప్రదించవచ్చు. ఈ నెల 30వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సెమ్స్ వర్గాలు తెలిపాయి.